సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 30 । జూన్ । 2024



రూ.1,00,101 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దవులూరి బ్రహ్మలక్ష్మి (తెనాలి మండలం పెదరావూరు) శనివారం రూ.1,00,101 విరాళం అందజేశారు.



ర్యాలి ఆలయంలో..

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మిరియాల దత్తసాయినాథ్ దంపతులు (బెంగళూరు) శనివారం రూ1,45,500 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 11,110 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 11,110 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,090, మధ్య డెల్టాకు 2,220, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.95 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కొవ్వూరులో భారీ వర్షం

కొవ్వూరు: జిల్లాలో శనివారం ఉదయం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో 22.9 మిల్లీమీటర్ల నగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొవ్వూరులో 43.2 మిల్లీమీటర్లు రికార్డయ్యింది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో.. దేవరపల్లి 39.2, చాగల్లు 27.4, గోపాలపురం 9.8, నల్లజర్ల 27, నిడదవోలు 16, తాళ్లపూడిలో 23.4, ఉండ్రాజవరం 2.6, అనపర్తిలో 37, బిక్కవోలు 7.4, కడియం 32, గోకవరం 2, కోరుకొండ 10, రాజమహేంద్రవరం రూరల్ 38.2, రాజమహేంద్రవరం అర్బన్ 39.4, రాజానగరం 29.6, రంగంపేట 35.4, సీతానగరం 19.6.

వరి దిగుబడి పెంపే లక్ష్యం

జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు



నల్లజర్ల: ఖరీఫ్‌లో దిగుబడులు పెంచడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు తెలిపారు. ముసుళ్ళగుంట వద్ద శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకూ 3,545 హెక్టార్లలో (4 శాతం) వరి నాట్లు పడ్డాయన్నారు. జిల్లాలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 77,817 హెక్టార్లు కాగా, దీనికి సంబంధించి 3,576 హెక్టార్లలో నారుమళ్లు వేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ 86 శాతం నారుమళ్లు పూర్తయ్యాయని చెప్పారు. జూలై 15 లోగా నాట్లు పూర్తి చేసుకుంటే అక్టోబరు చివరి నాటికి 70 శాతం కోతలు పూర్తవుతాయని, అందువలన రైతులు త్వరితగతిన నాట్లు పూర్తి చేయాలని సూచించారు. దీనివలన నవంబరులో వచ్చే తుపానులు, అధిక వర్షాల నుంచి పంటను కాపాడుకోవచ్చని చెప్పారు. నవంబరు 15 నాటికి ఖరీఫ్ పంట పూర్తయితే, ఏప్రిల్‌లో దాళ్వా కూడా పూర్తయి, మూడో పంటకు అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ ఏడాది 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. ఖరీఫ్‌లో జిల్లాకు 58 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే 21,500 మెట్రిక్ టన్నులు సిద్ధం చేశామన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించే కార్యక్రమం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైందన్నారు. కొన్ని మెట్ట మండలాల్లో వర్షాలు ఆలస్యమైతే, వెదజల్లే పద్ధతి అనుసరించాలని, ఈ విధానంలో ఎకరాకు 12 నుంచి 20 కిలోల విత్తనాలు సరిపడతాయని మాధవరావు చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. సత్యదేవుని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించి, పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలివచ్చారు. వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 4 వేల మంది స్వీకరించారు. ప్రతి శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే సత్యదేవుని ప్రాకార సేవను ఈసారి లోపలి ప్రాకారంలో నిర్వహించారు. పల్లకీ మీద స్వామి, అమ్మవార్ల విగ్రహాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారిని మూడుసార్లు ఊరేగించి, తిరిగి ఆలయానికి తీసుకుని వెళ్లారు.

శృంగార వల్లభుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కులు చెల్లించారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామిని సుగంధ పరిమళాలు వెదజల్లే పూలమాలికలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.2,93,349 ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. సుమారు 4 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

ఇదేం రుబాబు పాలన?

- సర్వత్రా అరాచకమే..
- యథేచ్ఛగా శిలాఫలకాల కూల్చివేత
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం
- వైఎస్సార్ సీపీ శ్రేణులపై బెదిరింపులు
- టీడీపీ కూటమి పాలనపై ప్రజల పెదవి విరుపు
- అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు



రాజమహేంద్రవరంలో గుర్తు తెలియని దుండగులు దహనం చేసిన మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రచార రథం (ఫైల్)



అనపర్తి సావరం సెంటర్‌లో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన చెల్లుబోయిన కృష్ణ



తీవ్రగాయాలతో వాద్రేవు చంద్రశేఖర్ (దుప్పలపూడి, అనపర్తి మండలం)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రశాంతతకు మారు పేరు. రాజకీయ కక్షలు, కార్పణ్యాలు, దాడులు, ప్రతిదాడులు అనే ఊసే గతంలో ఎప్పుడూ లేదు. ఎన్నికలు, పోలింగ్ వరకే రాజకీయాలు. ఆ తరువాత పార్టీ రహితంగా అన్నదమ్ముల్లా అందరూ కలసిమెలసే ఉంటారు. నిన్నమొన్నటి వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. కానీ ఇప్పుడా వాతావరణం మారి, సర్వత్రా అసహనం చోటు చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. సుమారు పాతిక రోజుల కిందట టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని మునుపెన్నడూ లేని రీతిలో భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. వరుసగా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట దాడులు, విధ్వంసాలు జరుగుతూనే ఉన్నాయి. పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అంతమొందిస్తామంటూ ఫోన్లు చేసి మరీ బెదిరిస్తున్నారు. ఊరు విడిచి వెళ్లాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇక శిలాఫలకాలు, ప్రజా ఆస్తుల ధ్వంసం గురించి చెప్పనవసరమే లేదు. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ఈ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. చివరకు పార్టీలకు అతీతంగా ప్రజలందరూ అభిమానించే మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను సైతం కొన్ని ప్రాంతాల్లో ధ్వంసం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా చాలాచోట్ల పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతుండటం విమర్శలకు తావిస్తోంది. కొత్తగా ఏదైనా అభివృద్ధి చేసి చూపిస్తారేమోననే ఆశతో అధికారం కట్టబెడితే.. ఇలా విధ్వంసకర ఘటనలకు పాల్పడటమేమిటంటూ.. పాలక పక్షాల నేతల తీరుపై దాదాపు అన్ని వర్గాల ప్రజలూ పెదవి విరుస్తున్నారు. అధికారం ఇచ్చింది ఇందుకేనా అని ప్రశ్నిస్తున్నారు. కూటమికి వ్యతిరేకంగా పని చేశారనే కక్షతో తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యాలకు, దాడులకు తెగబడుతున్న తీరుపై సర్వత్రా ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది.

దాడులు చేస్తున్నారిలా..

- జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభం సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేశారు. వారి పేర్లున్నాయనే కక్షతో ఆ శిలాఫలకం ధ్వంసం చేశారు.
- ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజేశ్వరి, ఆమె భర్త, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు ఇంటిపై వరుసగా రెండుసార్లు నాటు బాంబులు, కోడిగ్రుడ్లు, గాజుసీసాలతో దాడికి పాల్పడి, భయానక వాతావరణం సృష్టించారు.
- మాజీ మంత్రి రోజాపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టును ఖండించడమే పాపమన్నట్లు కాకినాడ సిటీలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన ఆలీషాపై టీడీపీ మద్దతుదారులు దాడికి ఒడిగట్టారు.
- పెద్దాపురం మండలం పులిమేశ్వరంలో రైతుభరోసా కేంద్రం శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీనిపై స్థానిక సర్పంచ్ ఆకుల వీరబాబు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు.
- రాజమహేంద్రవరం నగరం నడిబొడ్డున మాజీ ఎంపీ మార్గని భరత్‌రామ్ కార్యాలయంలో ఆయన ప్రచార రథాన్ని గుర్తు తెలియని దుండగులు తగులబెట్టేశారు. ఈ ఘటనకు సంబంధించి వైఎస్సార్ సీపీ నేతలు తెలుగు తమ్ముళ్లపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.
- కడియంలో రైతుబజారుకు అనుబంధంగా రైతుల ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న షెడ్డును సైతం తెలుగు తమ్ముళ్లు వెనుక ఉండి అధికారులతో కూల్చివేయించారు. దీనిని గిరజాల బాబు ఆధ్వర్యాన అడ్డుకోగా అక్రమంగా పోలీసు స్టేషన్‌కు తరలించారు.
- రాజానగరం మండలం రాధేయపాలెంలో కూటమి నేతలు విజయోత్సవ ర్యాలీలో సర్పంచ్ దుర్గ భర్త శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డారు.
- కొవ్వూరులో ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజునే తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కార్యాలయంపై దాడి చేసి, కార్ల అద్దాలను రాళ్లతో పగులగొట్టారు. కార్యాలయంపైకి రాళ్లు విసిరారు. అనంతరం మెప్మా కార్యాలయంలో కంప్యూటర్లు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు.
- నిడదవోలు మండలం తాళ్లపాలెం గ్రామ సచివాలయ భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకాన్ని, శెట్టిపేట సొసైటీ భవన నిర్మాణ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని, సమిశ్రగూడెం గీతా మందిరం వద్ద సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.
- గోపాలపురం - గుడ్డిగూడెం రోడ్డు శంకుస్థాపన శిలాఫలకాన్ని, చిట్యాలలో గ్రామ సచివాలయం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారు.
- అమలాపురం చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని, విలసవిల్లిలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న 5 రోడ్లకు సంబంధించిన 5 శిలాఫలకాలను కూడా ధ్వంసం చేశారు. రెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.
- మండపేట విజయలక్ష్మి నగర్ శశి స్కూల్ సమీపాన ఇటీవల ఆవిష్కరించిన రహదారి ప్రారంభ శిలాఫలకాన్ని ధ్వంసం చేసి, అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఫొటోలను పగులగొట్టారు. అక్కడితో ఆగని తమ్ముళ్లు వారం తిరగకుండా మరో రెండు శిలాఫలకాలను పగులగొట్టారు. జెండా స్థూపాన్ని జేసీబీతో మురికి కాలువలోకి తోసేశారు. ఈ ఘటనలను వైఎస్సార్ సీపీ నేతలు ఖండించగా, వైఎస్సార్‌సీపీ నేతలే ధ్వంసం చేసి ఉంటారని తెలుగు తమ్ముళ్లు మీడియా సమావేశంలో అనడం పలువురిని నివ్వెరపరిచింది. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సైతం మీడియా సమావేశంలో జనం విస్తుపోయేలా ఎదురుదాడికి దిగడం గమనార్హం.
- రావులపాలెం మండలం కేతరాజుపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకురాలు లోవలక్ష్మిపై ఆ గ్రామ టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు.
- ఆత్రేయపురం మండలం పులిదిండిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ముండేల్లి నాగరాజుపై బీరు సీసాలతో దాడి చేసి, భయానక వాతావరణం సృష్టించారు.

ఇది పద్ధతి కాదు



టీడీపీ నాయకులు అన్యాయంగా వ్యవహరిస్తున్నారు. దాడులు, ధ్వంసాలు శ్రుతి మించాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు చూడలేదు. ఇంత దారుణాలకు పాల్పడటానికేనా ప్రజలు అధికారం ఇచ్చారు? పైకి పారదర్శక పాలన సాగిస్తామంటూనే మరోపక్క దాడులు, విధ్వంసాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇది పద్ధతి కాదు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని దాడులకు పాల్పడుతున్న నేతలు, కార్యకర్తలు గుర్తుంచుకోవాలి. దాడుల్లో బాధితులవుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరఫున అండగా ఉంటాం. తగిన రక్షణ ఏర్పాట్లు చేసుకుంటాం.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు

హింసకు స్వస్తి చెప్పాలి



రాజకీయాల్లో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా అధికార, ప్రతిపక్షాల శ్రేణులు క్రమశిక్షణగా ఉండాలంటే.. ప్రజాసమస్యల పరిష్కారానికి ముందడుగు వేయించేలా ఆయా పార్టీల అధినేతలు చొరవ తీసుకోవాలి. అధికార ప్రతిపక్షం ఏదైనా ప్రధానంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోటీ పడాలి. ప్రజల అభిమానాన్ని పెంచుకోవాలి. హింస, దౌర్జన్యం, దాడులు, కొట్లాటలు, దహనాలు, సోషల్ మీడియాలో ఆకతాయి పోస్టులకు స్వస్తి చెప్పాలి.

– దూసర్లపూడి రమణరాజు, సామాజికవేత్త, కాకినాడ

హామీలు అమలు చేయండి



కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం భావ్యం కాదు. ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు పూర్తి సమయం అభివృద్ధిపై, ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఇలా శిలాఫలకాల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడటం సరికాదు. అందరూ స్వాగతించేలా కొత్త ప్రభుత్వం ఆలోచనలు, పరిపాలన ఉండాలే తప్ప, ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదు.

– రేవు తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీడీఎస్‌యూ, అమలాపురం

దాడుల సంస్కృతి మంచిది కాదు



ఎన్నికల్లో విజయం సాధించిన వారు ఓడిపోయిన వారిపై దాడులు చేసే సంస్కృతి మంచిది కాదు. ఏ పోటీలో అయినా ఒకరే విజయం సాధిస్తారు. గెలుపు ఓటములు సర్వసాధారణం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజలకు మేలు చేసే పని కోసం ఉపయోగించాలి. అధికారంలోకి వచ్చిన వారు గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను కొనసాగించాలి. దాడుల కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్నాయి.

– నూతలపాటి అప్పలకొండ, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సామర్లకోట

అనపర్తిలో.. అడ్డూ అదుపూ లేకుండా..

చంద్రబాబు ఆదేశాలతో సీటు కోసం చివరి నిమిషంలో టీడీపీ నుంచి బీజేపీ గూటికి చేరి, ఎమ్మెల్యే అయిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న అనపర్తి నియోజకవర్గంలో అత్యధికంగా దాడులు జరిగాయి. పలు గ్రామాల్లో పట్టపగలే తెలుగు తమ్ముళ్లు వైఎస్సార్ సీపీ నేతల ఇళ్లపై పడి ధ్వంసం చేయడమే కాకుండా.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామంటూ బెదిరింపులకు సైతం దిగారు. అనపర్తి ఉన్నత పాఠశాలలో బాలబాలికల రక్షణ కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.10.15 లక్షలతో నిర్మించిన ప్రహరీని సైతం ధ్వంసం చేశారు. నలుగురికీ ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధి ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ ప్రహరీని దగ్గరుండి మరీ కూల్చేయడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు. ఇంటికి వెళ్తున్న బలహీనవర్గాలకు చెందిన చెల్లుబోయిన కృష్ణ, అప్పన్నలపై అనపర్తి సావరం సెంటర్‌లో దారి కాచి కూటమి నేతలు మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. రామవరంలో నల్లమిల్లి సూర్రెడ్డి అద్దెకు ఉంటున్న ఇంటిపై ఎమ్మెల్యే అనుచరులు మూకదాడికి పాల్పడి విధ్వంసం సృష్టించారు. వారం తిరగకుండానే దొరికిన వారిని దొరికినట్టు ఇనుపరాడ్లతో రక్తం వచ్చేటట్టు కొట్టారు. వరుస దాడులు, ఎమ్మెల్యే అనుచరుల నుంచి చంపేస్తామనే బెదిరింపులతో నల్లమిల్లి సూర్రెడ్డి ప్రాణభయంతో పరారయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. రంగంపేట మండలం వడిశలేరులో కారి మార్తమ్మ ఇంటిపై మూక దాడికి పాల్పడి, ఇంట్లో ఉన్న వారిని బయటకు లాగి మరీ మారణాయుధాలతో విధ్వంసం సృష్టించారు. పాత వీరంపాలెంలో టీడీపీకి చెందిన వి.నాగబాబు, సత్తిబాబులు.. గండి వెంకటేశ్వరరావు ఇంటిపై పడి ఆయనను బయటకు ఈడ్చుకుంటూ వచ్చి మరీ దాడి చేశారు. మహేంద్రవాడకు చెందిన మేడపాటి శివారెడ్డిని రామవరం హైస్కూల్ వద్ద దారి కాచి కర్రలు, కత్తులతో దాడికి పాల్పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రామవరానికి చెందిన సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ఇంటిపై రెండు పర్యాయాలు దాడి చేసి, కిటికీ అద్దాలు పగులగొట్టి భయభ్రాంతులకు గురి చేశారు. ఎమ్మెల్యే అనుచరగణం ఇలా వరుస దాడులకు పాల్పడుతున్నా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి



కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ పీపీ ప్రసాదరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. కొత్త చట్టాలపై జాంపేటలోని పోలీసు కన్వెన్షన్ హాలులో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటి అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పీపీ జీవీఎస్ ప్రసాదరావు, కాకినాడ సబ్ కోర్టు అడిషనల్ పీపీ కె.రాధాకృష్ణంరాజు కొత్త, పాత చట్టాలు, వచ్చిన మార్పులపై వివరించారు. ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా భారత ప్రభుత్వం పాత చట్టాల్లో మార్పులు చేసి, కొత్తగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే చట్టాలను రూపొందించిందని చెప్పారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ, కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ వర్క్ షాప్ నిర్వహించామని అన్నారు. ఈ చట్టాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, కేసుల దర్యాప్తు చట్ట పరిధిలో జరపాలని సూచించారు. నియమాలను పాటిస్తే ముద్దాయిలకు శిక్షలు తప్పక పడతాయని, ఏవైనా అనుమానాలు, సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, న్యాయవాది బి.పద్మావతి, జిల్లాలోని జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పర్యాటకానికి ఎన్నో అవకాశాలు

- జిల్లాలో టూరిజం అభివృద్ధిపై సమగ్ర నివేదిక
- కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఎన్నో అవకాశాలున్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె శనివారం సమీక్ష నిర్వహించారు. కడియం నర్సరీలకు ప్రత్యేక స్థానం ఉందని, దీనిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వివిధ నర్సరీలను అనుసంధానం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో సుదీర్ఘమైన గోదావరి తీరం ఉందని, ఆయా ప్రాంతాల్లో పర్యాటక పరంగా బోటింగ్, క్రీడలు, ఇతర అనుబంధ ఉల్లాసం కలిగించే అవకాశం ఉన్న ప్రాజెక్టులపై ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కాటేజ్, కాన్ఫరెన్స్, బోటింగ్, మెడికల్, వెల్‌నెస్, క్రీడలు, అమ్యూజ్‌మెంట్ పార్కు, టీ, కాఫీ పాయింట్లు తదితర ప్రత్యేక గుర్తింపు కలిగిన వాతావరణం కల్పిస్తే రెండు మూడు రోజుల పాటు పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. పిల్లలను ఆకట్టుకునే రీతిలో గోదావరిపై సాహస, మానసిక ఉత్సాహం కలిగించే క్రీడాంశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎకో టూరిజానికి అనువైన ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. పర్యాటక శాఖ ఆర్డీ వి.స్వామినాయుడు మాట్లాడుతూ, నగరంలో గోదావరి తీరంలోని పద్మావతి, పుష్కర, సరస్వతీ ఘాట్లలో బోటింగ్ పాయింట్లు ఉన్నాయని తెలిపారు. హేవలాక్ వంతెనపై ఫుడ్ కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ తేజ్‌భరత్

డయేరియా నివారణపై దృష్టి సారించాలి

డయేరియా, సీజనల్ వ్యాధుల నివారణపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. వైద్య, ఆరోగ్య, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. డయేరియాకు సంబంధించి ఎటువంటి లక్షణాలు గుర్తించినా వెంటనే అప్రమత్తమై, సమన్వయ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు జారీ చేసే ధ్రువపత్రాలు పరిశీలించి, ఆకస్మిక తనిఖీలు చేసి, నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్లోరినేషన్ చేయని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు కాచి, చల్లార్చిన తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై సూక్ష్మస్థాయిలో అధ్యయనం చేసి, కారణాలు, నివారణ చర్యలపై నివేదిక అందచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఎస్‌పీ పద్మశ్రీ, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లక్ష్మీ సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,170 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో బాధితురాలికి అవార్డు అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శివకుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 45 కోర్టు బెంచ్‌లలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,170 కేసులు పరిష్కరించి, అవార్డులు అందజేశారు. వీటిలో క్రిమినల్ 1516, సివిల్ 504, ప్రీ లిటిగేషన్ కేసులు 150 ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ మాట్లాడుతూ, ఇన్సూరెన్స్, సివిల్ తగాదాలు, మోటారు వాహన ప్రమాదాలు, రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి చొరవ చూపేందుకు ముందస్తు సమావేశాలు నిర్వహించి, అవార్డు ఉత్తర్వుల జారీలో ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయవాదులు, ఇతర శాఖల అధికారుల చొరవ అభినందనీయమని అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ జరుగుతోందన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లు తోడ్పడతాయని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు డి.విజయ్‌గౌతమ్, వై.బెన్నయ్యనాయుడు, ఎం.మాధురి, స్పెషల్ జడ్జి ఫర్ ఎస్పీఈ అండ్ ఏసీబీ కోర్టు పీవీఎస్ సూర్యనారాయణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

- రైతులకు తక్షణం పెట్టుబడి సాయం అందించాలి
- ఏపీ రైతు సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జమలయ్య

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రబీ ధాన్యం బకాయిలను ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తానన్న రూ.20 వేలు ఈ ఖరీఫ్ నుంచే వెంటనే అందించాలని కోరారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు పూర్తవుతున్నా రైతులకు వరి వంగడాలు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని అన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.3 లక్షల వరకూ సున్నా వడ్డీకి, రూ.5 లక్షల వరకూ రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం రూ.1,60,000 వరకూ ఎటువంటి ష్యూరిటీ లేకుండా కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పంట కాలువలు, డ్రైనేజీల్లో తూటికాడ, గుర్రపు డెక్క, పూడికలను యుద్ధ ప్రాతిపదికన తొలగించి, సాగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేపూడి జ్యోతి, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైకి లేచిన రైల్వే గడ్డర్



జూనియర్ కళాశాల సమీపంలో పైకి లేచిన రైల్వే గడ్డర్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రైల్వే వంతెన వద్ద భారీ వాహనాల రాకపోకలు జరగకుండా రైల్వే అధికారులు వేసిన ఇనుప గడ్డర్ శనివారం ఉదయం పైకి లేచింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే సౌత్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో టూ టౌన్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను ఒక వైపుగా మళ్లించారు. బాలికల ఉన్నత పాఠశాల వైపు గడ్డర్ పైకి లేవడంతో జూనియర్ కళాశాల వైపు రోడ్డులో రాకపోకలు మళ్లించారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు పైకిలేచిన గడ్డర్‌ను యథాస్థితిలో ఉంచి వెల్డింగ్ పనులు పూర్తి చేశారు.

విద్యుత్ బిల్లులు నేడూ చెల్లించవచ్చు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 30వ తేదీ ఆదివారం విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ మూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ వసూళ్ల కౌంటర్లకు ఆదివారం సెలవు దినం అయినప్పటికీ పని చేస్తాయన్నారు.

కక్ష కట్టి.. కూల్చివేసి..

- కెనాల్ రోడ్డుపై షెడ్డు తొలగింపు
- ప్రజావసరాలకు వాడాలని చెప్పినా వినని వైనం
- వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన

కడియం: మంచి చెయ్యండని చెబితే.. మొత్తానికే కూల్చేశారు. కక్ష సాధించి అక్కసు కక్కారు. కడియం కెనాల్ రోడ్డుపై రైతుబజార్‌కు అనుబంధంగా నిర్మించిన షెడ్డుకు అనుమతుల్లేవంటూ పంచాయతీ అధికారులు శనివారం కూల్చివేశారు. ఈ షెడ్డును ప్రజావసరాలకు వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు (బాబు) తదితరులు ఎంపీడీఓ, తహసీల్దార్‌లను కలసి వినతిపత్రం ఇచ్చిన మర్నాడే కూల్చేయడం వెనుక ఆంతర్యం చెప్పకనే అర్థమవుతోంది. శనివారం సదరు షెడ్డు కూల్చివేతకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పోలీసుల సహకారంతో ఘటనా స్థలం వద్దకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో పార్టీ నాయకులు దాసరి శేషగిరి, దొడ్డా బుజ్జి, కుసునూరి బాబులు తదితరులు అక్కడకు చేరుకుని నిరసన తెలిపారు. షెడ్డు వద్దే బైఠాయించి కేవలం కక్ష సాధింపుతో షెడ్డును కూల్చి వేస్తున్నారంటూ ఆరోపించారు. రైతుబజార్ నిర్మాణ సామగ్రిని నిల్వ చేసుకునేందుకు మాత్రమే షెడ్డును నిర్మించామని, అవసరమైతే ప్రజావసరాల నిమిత్తం వినియోగించుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. అయినప్పటికీ అధికార పార్టీ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా షెడ్డును కూల్చివేయడానికి సిద్ధపడిందని గిరజాల బాబు అన్నారు. ఏడు రోజుల వ్యవధితో నోటీసు ఇచ్చారని, కానీ ఐదు రోజులకే షెడ్డును కూల్చివేశారన్నారు. అంతే కాకుండా పంచాయతీ వారిచ్చిన నోటీసులో పేర్కొన్న సర్వే నంబరుకు, షెడ్డు ఉన్న సర్వే నంబరుకు సంబంధమే లేదన్నారు. ఆర్‌అండ్‌బీ పరిధి స్థలంలో ఉన్న షెడ్డును కూల్చివేయడానికి పంచాయతీ కార్యదర్శి సిద్ధం కావడం దారుణమని బాబు అన్నారు. రైతుబజారు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరితే స్థలం మా పరిధిలోది కాదంటే మా పరిధిలోది కాదని పంచాయతీ శాఖాధికారులతో సహా వివిధ శాఖలు తీవ్ర కాలయాపన చేశాయని గుర్తు చేశారు. కానీ కూల్చివేయడానికి మాత్రం పంచాయతీ అధికారులు ముందుకు వచ్చారన్నారు. దీనిని బట్టి ఏ స్థాయి ఒత్తిడితో కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారో అర్థమవుతోందన్నారు.



షెడ్డు వద్ద నిరసన తెలుపుతున్న గిరజాల బాబు తదితరులు



ఎస్‌ఐ కృష్ణసాయితో చర్చలు జరుపుతున్న మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు



జేసీబీ సాయంతో షెడ్డును నేలమట్టం చేసిన దృశ్యం

బలవంతంగా స్టేషన్‌కు తరలింపు

కూల్చివేత పనులను అడ్డగించిన నేపథ్యంలో కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్‌ఐ కృష్ణసాయిలు తమ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. బలవంతంగా బాబు తదితరులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం షెడ్డు కూల్చివేశారు. పంచాయతీ స్వీపర్లు తదితరులు షెడ్డు రేకులను తొలగించారు. జేసీబీలతో గోడలను తొలగించారు. పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు అక్కడ మోహరించారు. కాగా గిరజాల బాబును పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. ఎస్‌ఐ కృష్ణసాయి ఆందోళనకారులకు నచ్చజెప్పి నిరసన విరమింపజేశారు. మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు పూచీకత్తు మేరకు ఆందోళనకారులను విడుదల చేశారు. గిరజాల నాగేశ్వరరావు, బాబ్జీ, చినబాబు, పార్టీ నాయకులు తిరుమలశెట్టి శ్రీను, బత్తుల రాము, కొత్తపల్లి రాము, బుడ్డిగ వీర వెంకట్రావుగౌడ్, ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, చిలుకూరి రామకృష్ణ, శాకా పట్టాభి, లావేటి రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు గిరజాల బాబుకు మద్దతుగా పోలీస్ స్టేషన్ వద్దకు తరలివచ్చారు.

స్టోరేజ్ ట్యాంక్‌లో పడి వ్యక్తి దుర్మరణం

- ప్రాణాలతో బయటపడిన మరొకరు
- పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లలో అపశ్రుతి

కొత్తపల్లి: వాకతిప్ప శివారులో ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి పథకం స్టోరేజ్ ట్యాంక్‌లో ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు, అధికారుల కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ వలసపాకలకు చెందిన తంగేళ్ల అప్పన్న (28), తంగేళ్ల లోవరాజుతోపాటు మరి కొంతమంది ఈ రక్షిత తాగునీటి పథకంలో ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేసే పనికి వచ్చారు. అప్పన్న, లోవరాజులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు గట్టుపైకి వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలుజారి గట్టుపై నుంచి సుమారు 15 అడుగుల లోతులో ఉన్న స్టోరేజ్ ట్యాంక్‌లో పడిపోయారు. సిబ్బంది బయటకు తీసే ప్రయత్నం చేసి లోవరాజును రక్షించారు. అప్పన్న స్టోరేజ్ ట్యాంక్‌లో గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లతో గాలించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న అప్పన్న కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ సంఘటనపై ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించిన తరువాత కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ జూలై మొదటి వారంలో పర్యటించనున్న సందర్భంగా తాగునీటి పథకాలను సందర్శించనున్నారని, అందువల్ల తాగునీటి పథకాన్ని శుభ్రపరుస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



అప్పన్న (ఫైల్)



ప్రాణాలతో బయటపడిన లోవరాజు

తెగుళ్లనూ తట్టుకునేలా...

- సూడోమోనాస్‌తో పంటకు ఉపయోగం
- విత్తన శుద్ధిలోనూ వినియోగం
- పైరు పెరుగుదలకు దోహదం

ఆలమూరు: మనం తినే ఆహారం నోటికి అందుతుందంటే అందులో రైతుల శ్రమ ఎంతో ఉంది.. విత్తు నుంచి పంట చేతికందే వరకూ వారి కష్టం చెప్పలేనిది.. ప్రధానంగా పంటల సాగులో తెగుళ్లు చుట్టేసి ఇబ్బంది పెడతాయి.. పైరు ఎదుగుదలనూ శాసిస్తాయి.. అలాంటి వాటి నుంచి రక్షణకు, వరి సాగులో పలు తెగుళ్ల నివారణకు 'సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్' జీవశిలీంధ్ర నాశిని ఎంతో ఉపయోగపడుతుంది. దీనిపై రైతులకు అవగాహన పెంచేందుకు వ్యవసాయ అధికారులు సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌తో పాటు ఉద్యాన పంటల సాగుకు పుడమి పుత్రులు సమాయత్తమవుతున్న తరుణంలో నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడులు సాధించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. సూడోమోనాస్‌ను విత్తనశుద్ధికి వినియోగించడం ద్వారా మొక్కలు ఆరోగ్యవంతంగా ఉంటాయని ఆలమూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ బ్యాక్టీరియాతో ఉపయోగాలు, వినియోగించాల్సిన విధానం, ప్రత్యేకతల గురించి ఆయన వివరించారు. ఆ వివరాలు తెలుసుకుందాం రండి..



కె.నాగేశ్వరరావు, సబ్ డివిజన్ సహాయ సంచాలకులు

సూడోమోనాస్ బలమైన బ్యాక్టీరియా కావడంతో ఈ మిశ్రమం భూమిలోని వరి వేర్లపై, ఆకులపై వచ్చే తెగుళ్లను నివారించడమే కాకుండా మొక్కల పెరుగుదలకు దోహదపడుతుంది. ఈ బ్యాక్టీరియా భూమి లోపల పొరల్లో, వాతావరణంలో కూడా పెరుగుతుంది. సూడోమోనాస్ యొక్క యాంటీ గోనిస్టిక్ లక్షణాలతో యాంటీ బయోటిక్స్ తయారవుతుంది. ఇది మొక్కల్లో సంభవించే బూజు, బ్యాక్టీరియా తెగుళ్లకు హానికరమైన వాటిని అరికడుతుంది. ఇది కై నటిక్ అనే ఎంజైమ్‌ను విడుదల చేయడంతో ప్రమాదకరమైన బూజు తెగుళ్ల కణాల గోడలపై పనిచేసి నాశనం చేస్తుంది. పేడ, పాలు లేదా నీటిలో కలిపిన ఈ మందు మిశ్రమాన్ని విత్తన దశలో పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.



సూడోమోనాస్, శుద్ధి చేసిన విత్తనాలు

ఉపయోగాలు ఇవీ..

వరిలో ఆశించే ఆకు ఎండు, పాముపొడ, అగ్గి, పొట్టకుళ్లు తెగుళ్లను సూడోమోనాస్ నివారిస్తుంది. జీవ శిలీంధ్ర నాశిని కావడంతో వాతావరణ కాలుష్యం, భూమి, మానవులకు ఏవిధమైన హాని కలగజేయదు. ఈ మందు కాకినాడలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయోలాజికల్ ల్యాబ్‌లో తయారవ్వడం వల్ల రైతులకు తక్కువ ధరకు లభిస్తుంది. కిలో రూ.150కే అందిస్తున్నారు.

ఉపయోగించే విధానం

విత్తనశుద్ధిలో భాగంగా కిలో విత్తనాలకు ఎనిమిది నుంచి పది గ్రాముల పొడి మందును పది మిల్లీ లీటర్ల నీటిలో కలపాలి. వేళ్లను శుద్ధి చేయడానికి ఒక కిలో సూడోమోనాస్ ఫార్ములాను నిల్వ ఉండే నీటిలో ఉంచి వరి వేళ్లను ఒక గంట సమయం పాటు ఉంచి నాటితే తెగుళ్లను నివారించడమే కాకుండా మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది. భూమిలో చల్లాలనుకుంటే, ఎకరాకు కిలో సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందును అతిగా చీకిపోయిన సుమారు 50 కిలోల పశువుల ఎరువుతో మిశ్రమం చేయాలి. దీనిని ఒక వారం పాటు నీడలో ఉంచి కలియ తిప్పాలి. మళ్లీ ఆ మిశ్రమాన్ని మరో వారం రోజుల పాటు నిల్వ ఉంచి దుక్కిలో వేయడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు. అనంతరం కిలో సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరా పైరుపై పిచికారీ చేయాలి.



సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మిశ్రమం తయారు చేస్తున్న దృశ్యం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కల్చర్ వాడే మందు సమయంలో భూమిలో తగు తేమ ఉండేటట్లు చూసుకోవాలి.
- ఈ మందును కంపోస్టు, ఇతర పశువుల ఎరువులు, జీవ సంబంధ పదార్థాలతో కలిపి వాడుకోవచ్చు.
- రసాయన ఎరువులు, పురుగు మందులతో కలిసి వాడరాదు.
- ఈ మిశ్రమాన్ని చల్లని పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి.
- కల్చర్‌ను తయారు చేసిన ఆరు నెలల్లోపు వాడాలి.

అభివృద్ధి పనుల శిలాఫలకం ధ్వంసం

అమలాపురం టౌన్: అమలాపురం చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానానికి ఎదురుగా గత ప్రభుత్వంలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి సంబంధించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విశ్వరూప్‌ల ఫొటోలతోపాటు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల పేర్లతో ఉన్న ఆ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి మాయం చేశారు. దీనిపై పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని ఆధ్వర్యంలో ఆ దేవస్థానం మాజీ చైర్మన్ కల్వకొలను బాబి, నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కల్వకొలను ఉమా తదితరులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతాన్ని శనివారం మధ్యాహ్నం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులు వాటి శకలాలను సమీపంలోని డ్రెయిన్‌లో పడేసినట్లు వారు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తామని పట్టణ సీఐ క్రిష్టోఫర్ తెలిపారు. శిలాఫలకం ఘటనపై వైఎస్సార్ సీపీ నాయకుడు కల్వకొలను బాబి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పోలీసు అధికారులకు వివరించారు. ఇదే వార్డులో గతంలో మరో శిలాఫలకాన్ని కూడా ధ్వంసం చేశారని చెప్పారు.



అమలాపురంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసి దాని ముక్కలను డ్రెయిన్‌లో పడేసిన దృశ్యం

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి



మృతి చెందిన గొర్త చిన్న

బిక్కవోలు: విద్యుదాఘాతానికి ఓ వ్యక్తి మృతి చెందినట్లు బిక్కవోలు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఊలపల్లి గ్రామానికి చెందిన గొర్త చిన్న (44) ఎలక్ట్రికల్ లైన్‌మెన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం పనిలోకి వెళ్లాడు. స్థానిక ఆర్‌ఎస్‌పేట కాటన్‌దొర విగ్రహం వద్ద 11 కేవీ మెయిన్ లైన్ విద్యుత్తు స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రమాదశాత్తు విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ రాకుండా నిలుపుదల చేశామని అధికారులు చెబుతుండగా, అయితే విద్యుత్ ఎలా వచ్చిందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. బిక్కవోలు మాజీ పీహెచ్‌సీ చైర్మన్ సురేష్ కుమార్‌రెడ్డి వివరాలు తెలుసుకుని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.